ప్రజాశక్తి





ఉత్సవ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

నాడు అభివృద్ధి..నేడు విలీనం..!



ప్రభుత్వ విద్యావ్యవస్థను పటిష్టం చేయడంలో భాగంగా పాఠశాలల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీని ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు నిధులను మంజూరు చేస్తోంది. ఇప్పటికే రెండు విడతల్లో పలు అభివృద్ధి పనులనూ చేపట్టారు. నాడు-నేడు అభివృద్ధి పనులను ఇలా ఉంచితే నూతన విద్యావిధానం పేరుతో తీసుకొస్తున్న కొత్త సంస్కరణలు పాఠశాలల మనుగడకే ప్రమాదాన్ని తెచ్చి పెడుతున్నాయి. నూతన విధ్యావిధానానికి అనుగుణంగా ఇప్పటికే పలు పాఠశాలలను ప్రభుత్వం విలీనం చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలు విలీనం పేరుతో మూతబడ్డాయి. నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేసిన పాఠశాలలు కూడా విలీనం కావడంతో ఆ తరగతి గదులన్నీ ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. అభివద్ధి పేరుతో ప్రభుత్వం ఖర్చు చేసిన ప్రజాధనం వథా అయ్యింది.

- ◆ విద్యార్థులు లేరన్న సాకుతో మూత దిశగా ప్రభుత్వ పాఠశాలలు
- ◆ నిరుపయోగంగా మారుతున్న తరగతి గదులు
- ◆ విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో జరగని అభివృద్ధి

ప్రజాశక్తి-చిలమత్తూరు

వైసిపి ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మున్సిపాల్టీలతో పాటు, ఆయా గ్రామాల్లో పాఠశాలల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ నిధులతో నిర్మాణ పనులనూ పూర్తి చేశారు. పనుల అనంతరం ఆర్భాటంగా ప్రజాప్రతినిధులు వాటిని ప్రారంభించారు. ఇంతవరకు బాగానే ఉన్నా, విలీనం అంశం రాగానే కొత్త కష్టాలు వచ్చాయి. అన్ని వసతులతో పాఠశాల ఉన్నా, అది వేరే పాఠశాలలో విలీనం కావడంతో నిధులన్నీ బూడిదలో పోసిన పన్నీరుగా మారాయి. విలీనం అయిన పాఠశాలలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే ప్రభుత్వ నిర్ణయం ఎంత తెలివితక్కువగా ఉందో ఇట్టే అర్థం అవుతోంది. చిలమత్తూరు మండలంలో మొదట విడతలో సోమగట్ట ప్రాథమిక పాఠశాలకు రూ.12.67 లక్షలు, చిలమత్తూరు ప్రాథమిక పాఠశాలలో రూ.19 లక్షలతో నాడు-నేడు కింద అభివృద్ధి పనులు చేశారు. ఈ పనులు జరిగే సమయంలో సోమగట్ట పాఠశాలలో 56 మంది విద్యార్థులు ఉన్నారు. నూతన విద్యావిధానం అమల్లోకి రావడంతో ఈ పాఠశాలలోని 3,4,5 తరగతులు పక్క పాఠశాలలోకి విలీనం అయ్యారు. ఇక్కడున్న విద్యార్థులు వేరే పాఠశాలలకు వెళ్లడంతో సోమగట్ట పాఠశాలలో ప్రస్తుతం 20 మంది విద్యార్థులే మిగిలారు. చిలమత్తూరు ప్రాథమిక పాఠశాలలో 111 మందికి గాను విలీనం అనంతరం 37 మంది మిగిలారు. ఇక్కడ విద్యార్థులు తక్కువగా ఉన్నారన్న కారణంతో ఈ పాఠశాలలను మూసివేత దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

అవగాహన రాహిత్యమేనా.?

నాడు-నేడు పనులు, విలీనం అంశాలను పరిశీలిస్తే అధికారుల అవగాహన రాహిత్యమా.? ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలా..? అన్న అనుమానాలు వ్యక్తం అవుతాయి. చిలమత్తూరు మండల వ్యాప్తంగా రెండవ విడతలో ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీలతో కలుపుకుని 30 పాఠశాలను ఎంపిక చేశారు. ఇందులో గాడ్రాళ్లపల్లి ప్రాథమిక పాఠశాల, చిలమత్తూరు బీసి కాలనీలోని పాఠశాలలను రెండవ విడతలో నాడు-నేడు కోసం ఎంపిక చేశారు. విద్యాశాఖ అధికారుల తెలిపిన వివరాల మేరకు ఎంపిక చేసే సమయంలో గాడ్రాళ్లపల్లిలో 26 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులోని 3,4,5 తరగతుల విద్యార్థులను చిలమత్తూరు హైస్కూల్‌లో విలీనం చేయడంతో ఆ సంఖ్య 11కు పడిపోయింది. అప్పటికే ప్రభుత్వం ఈ పాఠశాలలో నాడు-నేడు కింద రూ.12 లక్షలతో అభివృద్ధి పనులను చేసింది. ఇక చిలమత్తూరు బీసీ కాలనీలోని పాఠశాల ఎంపిక సమయంలో 37 మంది ఉండగా 3,4,5 తరగతులను చిలమత్తూరు హైస్కూల్‌లో విలీనం చేయడంతో ప్రస్తుతం ఆ పాఠశాలలో 11 మంది విద్యార్థులే మిగిలారు. ఈ పాఠశాల అభివృద్ధికి రూ.12 లక్షలతో పనులు జరిగాయి. విలీనం అనంతరం విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో వచ్చే సంవత్సరం చిలమత్తూరు బీసీ కాలనీలోని పాఠశాల ఉంటుందా.? ఉండదా..? అనే ప్రశ్న ఉత్పన్నం అవుతోంది.

అభివృద్ధి చేయాల్సిన పాఠశాలను గాలికి వదిలేసి...

నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేయాల్సిన పాఠశాలల ఎంపిక విషయంలో అధికారులు సరైన ప్రణాళికతో ముందుకెళ్లలేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాల్సిన పాఠశాలలను వదిలేసి, విలీనం అయ్యే పాఠశాలల్లో పనులు చేసి నిధులను వృథా చేశారు. చిలమత్తూరు మండల పరిధిలోని వీరాపురం పంచాయతీలో ఉన్న వెంకటాపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంది. మొదట విడత నాడు-నేడులో ఎంపిక చేసి గ్రామంలో ఉన్న పాఠశాలకు మరమతులు చేశారు. అయితే ఇక్కడ తరగతి గదులు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా లేవు. దీంతో లక్ష్మీపురం సమీపంలో దాతలు, ఎంపిపి పురుషోత్తమ రెడ్డి సహకారంతో అదనపు గదులు నిర్మించారు. ఈ పాఠశాలలో 6,7,8 తరగతులలో 90 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలను వచ్చే ఏడాది జిల్లా పరిషత్తు పాఠశాలగా మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. పెరిగిన విద్యార్థుల సంఖ్య రిత్యా విద్యాశాఖ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు యోచిస్తుంది. విద్యార్థులు ఎక్కువగా ఉన్న ఇలాంటి పాఠశాలను రెండోవిడత నాడు-నేడుకు ఎంపిక చేయకపోవడం విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంకు అద్దంపడుతోంది. ఇలా పలు ప్రభుత్వ పాఠశాలలు నాడు-నేడు, విలీనం రెండు విధాలుగా నష్టపోతున్నాయి. నూతన విద్యావిధానం పేరుతో పాఠశాలలను మూసి వేయకుండా అన్నింటిలోనూ అభివృద్ధి చేసి ప్రభుత్వ విద్యను మరింత పటిష్టం చేసే దిశగా అటు ప్రభుత్వం, ఇటు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.



దాతల సహకారంతో నిర్మించిన వెంకటాపురం మండల ప్రాథమికోన్నత పాఠశాల




రెండవ విడతలో నాడు-నేడుకు ఎంపికైన చిలమత్తూరు బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల

నేడు వేమన జయంతి ఉత్సవాలు

- ◆ సిద్ధమైన కటారుపల్లి గ్రామం
- ◆ హాజరుకానున్న మంత్రి రోజా

ప్రజాశక్తి-గాండ్లపెంట



తెలుగు సమాజానికి తన పద్యాల ద్వారా వెలుగులు నింపిన వేమనకు కొండంత వెలుగును ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జనవరి 19వ తేదీన వేమన జయంతిని రాష్ట్ర పండుగగా జరపాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా, గాండ్లపెంట మండలం కటారుపల్లి గ్రామంలో ఉన్న వేమన సమాధి ప్రాంతంలో వేమన జయంతి ఉత్సవాల ప్రారంభ రాష్ట్ర స్థాయి కార్యక్రమాలు గురువారం నాడు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9గంటలకు కటారుపల్లి గ్రామంలో వేమన సమాధి వద్ద జరిగే వేమన జయంతి ఉత్సవాలను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతి శాఖ మంత్రి ఆర్‌కె.రోజా, రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషచరణ్‌శ్రీ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుమ్మనూరు జయరాం ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించనున్నారు. వీరితో పాటు కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు డా॥పివి.సిద్ధారెడ్డి, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్‌తో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఇతర శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు ప్రజా ప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, అధికారులు హాజరు కానున్నారు. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలందరూ వేమన సమాధిని దర్శించుకోనున్నారు. తరువాత కటారుపల్లి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకుని అక్కడ జరిగే సభలో పాల్గొంటారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి ఇప్పటికే శ్రీ సత్యసాయి జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

కటారుపల్లిలో గురువారం జరగనున్న శ్రీ యోగి వేమన జయంతి ఉత్సవాల ఏర్పాట్లను కలెక్టర్ బసంత్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమం విజయవంతం అయ్యే విధంగా అన్ని చర్యలూ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం శాఖ మేనేజర్ నాగేశ్వర్ రెడ్డి, డివిఎం చంద్రమౌళి, టూరిజం శాఖ ఈఈ ఈశ్వరప్ప, తహశీల్దార్ రవి, ఎంపీడీవో డి.అంజినప్ప, ఎంపిపి తాత జగన్మోహన్, వైసీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ జడ్పిటిసి కె.భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాకప్‌డెత్‌పై జిల్లా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి : సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాయదుర్గం పోలీస్ స్టేషన్లో మంగళవారం తెల్లవారుజామున ఉరేసుకుని మరణించినట్లు చెప్పబడుతున్న కురుబ రామాంజనేయులు మరణంపై జిల్లా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దొంగతనం కేసులో స్టేషన్‌కు తీసుకొచ్చిన కురబ రామాంజనేయులు పోలీస్ స్టేషన్‌లోనే ఉరేసుకున్నాడనడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. నిందితులను సకాలంలో కోర్టులో హాజరు పరచకపోడం వల్లే ఈ మరణం జరిగిందన్నారు. కావున దీనిపై న్యాయ విచారణ జరిపి వాస్తవాలను ప్రకటించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంతకల్లు, ఉరవకొండ : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు అనంత సంకల్పం పేరిట చేపడుతున్న కార్యక్రమాన్ని తూచా తప్పకుండా అమలు చేయాలని ఉపాధ్యాయులు, ఎంఈవోలను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం నాడు డివిజన్ పర్యటనలో భాగంగా కలెక్టర్ గుంతకల్లు, వజ్రకరూరు మండలాల్లో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, సచివాలయ భవనాలు, జగన్నకాలనీలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో పాఠశాలలను సందర్శించి కలెక్టర్ పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పాఠాలకు సంబంధించి పలు ప్రశ్నలను అడిగారు. సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల్లో వెనకబడుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ముగిసిన తర్వాత గ్రామ స్థాయిలోనే విద్యార్థులకు విద్యా వాలంటీర్ల ద్వారా రోజువారీ పాఠాలు రివిజన్ చేయించాలన్నారు. ఆయా గ్రామాల్లో గర్భిణులు, బాలింతల ఆరోగ్య సూచీలు, బాల్య వివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీల గురించి సచివాలయ ఉద్యోగులను ఆరా తీశారు. గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న ఆహారం అంగన్ వాడీల్లోనే భోజనం చేసేలా చూడాలన్నారు. ముఖ్యంగా వజ్రకరూర్ మండలంలోని తండాలలో గిరిజన బాల, బాలికలు తప్పనిసరిగా పాఠశాలకు వచ్చేలా చూడాలని విద్యా సెక్రెటరీలను ఆదేశించారు.

ఉగాది నాటికి 14 వేల ఇళ్లు నిర్మిద్దాం

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఉగాది నాటికి జిల్లాలో మొత్తం 14 వేల ఇళ్లు నిర్మించి మెగా గహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించుకుందామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఉద్యోగులు, లబ్ధిదారులకు సూచించారు. బుధవారం నాడు గుంతకల్లు అర్బన్ హౌసింగ్ లేఅవుట్‌లో లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు అందిస్తున్న రూ.35 వేల రుణ సహాయాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలన్నారు. లబ్ధిదారులకు సకాలంలో ఇసుక, సిమెంట్ సరఫరా చేయాలని, బిల్లులు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఆర్డీవో రవీంద్ర, జెడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, గుంతకల్లు తహశీల్దార్ రాము, వజ్రకరూర్ తహసీల్దార్ అనిల్ కుమార్, గుంతకల్లు మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న, హౌసింగ్ డీఈ రామకష్ణా రెడ్డి, వజ్రకరూర్ ఎంపీడీవో చంద్రమౌళి, వజ్రకరూర్ ఎంఈవో ఎర్రిస్వామి పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభల్లో జిల్లా నేతలు



సిఐటియు జాతీయ మహాసభల్లో పాల్గొన్న సిఐటియు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా నాయకులు

సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) అఖిల భారత 17వ మహాసభ బుధవారం కర్నాటక రాజధాని బెంగుళూరు పట్టణంలోని ప్యాలెస్‌గ్రౌండ్‌లో అట్టహాసంగా ప్రారంభమైంది. దేశం నలమూలల నుంచి సిఐటియు ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన సిఐటియు నాయకులూ పాల్గొన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్.నాగేంద్రకుమార్, ఈఎస్.వెంకటేష్, నాగమణి, నూర్‌మహ్మద్ పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దుకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్

- ◆ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి
- ◆ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి
- ◆ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం చేకూర్చే విధంగా తీసుకొచ్చిన సిపిఎస్‌ను రద్దు చేసేంత వరకు ఉద్యోగ, ఉపాధ్యాయులను కలుపుకుని యుటిఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం అనంతపురం జిల్లా కేంద్రంలోని యాదవ కళ్యాణమండపంలో యుటిఎఫ్ పశ్చిమ రాయలసీమ జిల్లాలు కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఓపీఎస్‌కు ప్రత్యామ్నాయం సిపిఎస్ అని చెబుతోందన్నారు. ఇది ఏమాత్రం ఆమోద యోగ్యం కాదన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్ అమలు చేయాల్సిందే అన్నారు. సిపిఎస్‌కు ప్రత్యామ్నాయం జిపిఎస్ కాదని ఓపీఎస్ మాత్రమే అన్నారు. సిపిఎస్ అంతం యుటిఎఫ్ పంతంగా పోరాడుతామన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోవడం అన్యాయంగా ఉందన్నారు. దేశంలో బెంగాల్లో ఇప్పటికీ పాత పెన్షన్ విధానమే అమలు చేస్తోందన్నారు. తాజాగా రాజస్థాన్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలు ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేస్తున్నాయని, జార్ఖండ్, పంజాబ్ రాష్ట్రాలు తాము కూడా పాత పెన్షన్ విధానం అమలు చేయనున్నట్లు ప్రకటించాయని తెలిపారు. బిజెపి పాలిత రాష్ట్రాలైన హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో కూడా పాత పెన్షన్ విధానం కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం పాత పెన్షన్ విధానం అమలుకు ప్రయత్నించకపోవడం చాలా బాధాకరం అన్నారు. గడచిన సంవత్సర కాలం నుంచి 30 వేల ఉపాధ్యాయ పదోన్నతులు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా పదోన్నతులు ఇవ్వకపోగా వర్క్ అడ్జస్‌మెంట్ పేరుతో ఉపాధ్యాయులను వేధించడం ప్రభుత్వానికి తగదన్నారు. వెంటనే ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతలు ఇచ్చి, బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇక నూతన విద్యావిధానం పేరుతో ప్రభుత్వ పాఠశాలల విలీనాన్ని ఆపాలన్నారు. విలీనం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుకు దూరం అవుతున్నారని తెలిపారు. పాఠశాలల కుదింపు జరుగుతోందని, దీని వల్ల ఉపాధ్యాయ పోస్టులు తగ్గిపోయి పాఠశాల వ్యవస్థ కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందన్నారు. మార్చిలో జరిగే పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న అప్రజాస్వామ్య విధానాలను విడనాడాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన రెండు డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, నాగమణి, కోటేశ్వరప్ప, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, ఆరు జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరి ప్రసాద్, జబీర్, మహేష్ బాబు, పివి.ప్రసాద్, సుధాకర్, ఎల్లప్ప, జయరాజు, గోవిందరాజులు, లింగమయ్య, నాగేంద్ర పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత : జెసి కేతన్ గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత పాటించాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ పిలుపునిచ్చారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు సందర్భంగా స్థానిక అంబేద్కర్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతను పాటించాలన్నారు. ప్రభుత్వంతో చేయి కలిపి అందరూ విధిగా రోడ్డు భద్రతను పాటించాలన్నారు. అప్పుడే ప్రమాదాలను నివారించగలుగుతామని తెలిపారు. కాలం ఎంతో విలువైనదని అంతకంటే జీవితం గొప్పదని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ప్రయాణంలో ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని వేగ నియంత్రణను పాటించడంతోపాటు సీటు బెల్టు తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. ప్రయాణ సమయంలో మద్యం సేవించడం సెల్ఫోన్ డ్రైవింగ్ చేయడం వంటి వాటిని పూర్తిగా దూరంగా ఉంచాలన్నారు. ఈ నేపథ్యంలో రవాణా శాఖ రూపొందించిన రహదారి భద్రత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ శివరాం ప్రసాద్ డిఎస్‌పి శ్రీనివాసులు, ఆర్టీవో సురేష్ నాయుడు ఎంవిఐ ఆపికా నాయర్, సునీత, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఎస్‌సిపి విద్యార్థులు పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ పరీక్ష

గుంతకల్లు : డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్ మోడల్ పరీక్షలను శ్రీ సాయి ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టూ టౌన్ సీఐ గణేష్, ప్రజ్ఞ కోచింగ్ సెంటర్ రాజశేఖర్, శ్రీ సాయి కాలేజ్ కరస్పాండెంట్ జి.ప్రభాకర్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోలీస్ మోడల్ పరీక్ష నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ మోడల్ పరీక్ష అభ్యర్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలో 300 పోస్టులు ఉన్నాయన్నారు. 40 వేలమంది దరఖాస్తు చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ధైర్యంగా పరీక్షలు రాయాలన్నారు. డివైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ నిరుద్యోగులకు ఎల్లప్పుడూ డివైఎఫ్ఐ అండగా ఉంటూ ఇలాంటి మోడల్ పరీక్షలు నిర్వహిస్తోందన్నారు.

రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి

బొమ్మనహాల్ : శాతవాహన ఫ్యాక్టరీలో విధి నిర్వహణలో ప్రమాదానికి గురై మరణించిన బీహార్ రాష్ట్రానికి చెందిన కార్మికుడి కుటుంబానికి యాజమాన్యం రూ.20 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి డిమాండ్ చేశారు. బుధవారం ఆమె విలేకరులతో ఫోన్‌లో మాట్లాడారు. పరిశ్రమలో కార్మికులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతుంటే యాజమాన్యం తూతూమంత్రంగా వారికి ఆయమందించి చేతులు దులుపుకోవడం ఎంతవరకు న్యాయమని నిలదీశారు. కార్మిక చట్టం ప్రకారం ప్రతి కార్మికులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఫ్యాక్టరీలో పరాయి రాష్ట్రాల వారికి ఉద్యోగాలు ఇచ్చారని, మన రాష్ట్రానికి చెందిన వారికి ఎందుకు ఉద్యోగాలు ఇవ్వలేదని ప్రశ్నించారు. స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని, మూడు షిఫ్టులుగా విధులు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నిత్యావసర సరుకులు అందజేత

బుక్కరాయసముద్రం : ఇటీవల ప్రమాదంలో గాయపడ్డ బుక్కరాయసముద్రం మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన నిరుపేద కొండమ్మ కుటుంబానికి నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ నిర్మలామురళి బుధవారం నిత్యావసర సరుకులు అందజేశారు. తిరుపతిలో ఉన్న తన తమ్ముడు కమలాకర్ పుట్టిన రోజును పురస్కరించుకుని రెండు నెలలకు సరిపడా సరుకులతో పాటు రూ.5 వేలు నగదును బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా నిర్మల మురళి మాట్లాడుతూ పేద కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో రామచంద్ర, లక్ష్మి, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పుట్లూరు : పాలెగార్ కుల క్యాలెండర్‌ను టిడిపి శింగనమల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ నీలారెడ్డిపల్లి గ్రామంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కుల నాయకులు గోవర్ధన్ రాజు, నాగేష్, బొమ్మిలి నాయుడు, రంగస్వామి, మల్లికార్జున, రంగడు, లింగమయ్య, చిన్న లింగమయ్య నాగలింగం, మూర్తి, టీడీపీ నాయకులు బాబు, తూముచెర్ల బాబా పక్రుద్దీన్ వలి, ఆది, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేలం పాటలు

రాయదుర్గం : రాయదుర్గం మండలం మల్లాపురం గ్రామ పరిధిలోని చెరువులో చేప పిల్లల పెంపకం, అమ్ముకునే హక్కు కోసం స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి హేమంత్ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 దరావతు సొమ్ము చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని తెలిపారు. అలాగే పంచాయతీ పరిధిలో బళ్లారి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చింత చెట్ల ఫల సాయం అనుభవించుకునే గురువారం ఉదయం 11:30 గంటలకు స్థానిక ఆంజనేయస్వామి ఆలయ ఆవరణంలో వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి హేమంత్ రాజు తెలిపారు.

సచివాలయం తనిఖీ

పుట్లూరు : మండల కేంద్రంలోని సచివాలయాన్ని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఓబులమ్మ ఎంపిడిఓ యోగానందరెడ్డితో కలిసి బుధవారం తనిఖీ చేశారు. సచివాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం సచివాలయం అధికారులు, గ్రామ వాలంటీర్లతో సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సరోజ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వశాంతి మహోత్సవం

రాయదుర్గం : రాయదుర్గంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో బుధవారం విశ్వశాంతి దినోత్సవం జరిగింది. ఈశ్వరీయ విశ్వవిద్యాలయాన్ని 1937 స్థాపించారు. నేడు 9000 సేవా కేంద్రాలు 140 దేశాల్లో ఉచిత రాజయోగ సేవా కేంద్రాలుగా సేవలను అందిస్తున్నాయి. 42 రోజులపాటు మౌన యోగా నిర్వహించి 36 రకాల వంటకాలను 300 మందికి ఈశ్వరీయ ప్రసాదంగా అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ ఛైర్మన్ ఉపేందర్ రెడ్డి, రామ్‌రెడ్డి, జ్యోతి, రచన, గోపి, ప్రసాద్, ప్రకాష్, సిద్ధప్ప, తిమ్మప్ప, విశ్వనాథ్, శివశంకర్, బిందు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో అమృతరాజ్‌కు సన్మానం

ఉరవకొండ : ఉరవకొండ ఎంపీడీవో అమతరాజుకు జిల్లా పరిషత్‌లో అకౌంటెంట్ ఆఫీసర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ జిల్లా పరిషత్తు సీఈవో ఆదేశాలు జారీచేసింది. బుధవారం ఎంపిడిఒ కార్యాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అమృత్ రాజును సన్మానించారు.

23 నుంచి డీఎడ్ మొదటి సెమిస్టర్ పరీక్షలు

అనంతపురం సిటీ : అనంతపురము, శ్రీ సత్యసాయి జిల్లాలకు సంభందించిన డిఎడ్ మొదటి సెమిస్టర్ పరీక్షలను ఈనెల 23వ తేదీ నుండి 30వ తేదీ వరకు వరకు ఉదయం 9.00 నుండి 11.30 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జి.కృష్ణయ్య తెలిపారు. మొదటి సెమిస్టర్ జనవరి–2023 పరీక్షకు సంబంధించి ఈనెల 17 నుండి హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చున్నారు. అనంతపురము, శ్రీ సత్యసాయి జిల్లాకు కలిపి జెడ్పి బాలికల ఉన్నత పాఠశాల బుక్కపట్నం, శ్రీ సత్యసాయి జిల్లా పరీక్ష కేంద్రం కేటాయించారు. పరీక్షకు అనంతపురము జిల్లా నుండి 16 మంది, శ్రీ సత్యసాయి జిల్లా నుండి 121 మంది మొత్తం 137 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. విద్యార్థులకు కేటాయించిన సమయం కంటే ఒక గంట ముందుగా పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని గోవింద నాయక్, ప్రభుత్వ పరీక్ష సహాయ కమిషనర్ తెలియజేశారు.

In the Court of the Senior Civil Judge:Penukonda
H.M.O.P.106/2021

Between:
Yadiki Suneethadevi ...Petitioner
And
D.Raja Murali ...Respondent

To,
D.Raja Murali S/o Sathya Narayana, Business, D.No.23/33, Opp:State Bank of India, Gandhi Bazaar, Old Town, Anantapur.

ఇందుమూలకముగా నీకు తెలియచేయడమేమనగా పై నెంబరు H.M.O.P.106/2021లోని అర్జీదారులు 11-8-2011వ తేదీన మీతో జరిగిన వివాహమును రద్దుచేసి విడాకులు యివ్వవలయునని పై అర్జీని దాఖలు చేసినది. సదరి విషయములై నీకు ఏమైన ఆక్షేపణలు వున్న యెడల నీవు 23-01-2023వ తేదిన ఉ॥10.30 గం॥లకు ఖుద్దన గానీ, వకీలు ద్వారా గానీ హాజరై నీ వాదనను కోర్టువారికి తెలుపుకొనవలయును లేని యెడల మీ పరోక్షమందు పై అర్జీని తీర్మానము చేయుదురని యిందుమూలముగా నీకు తెలియచేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఆర్.శ్రీకాంత్‌రెడ్డి, అర్జీదారుపరం వకీలు
పెనుకొండ, శ్రీ సత్యసాయి జిల్లా.

కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలు పకడ్బంధీగా నిర్వహిస్తాం

ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి ఫక్కీరప్ప

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

అనంతపురం జిల్లాలో ఈనెల 22వ తేదీన జరుగనున్న కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్షలను పకడ్బంధీగా నిర్వహిస్తామని ఎస్‌పి డాక్టరు ఫక్కీరప్ప కాగినెల్లి చెప్పారు. బుధవారం జెఎన్‌టియు పరీక్ష కేంద్రం, గుత్తి పట్టణంలోని స్ట్రాంగ్ రూములను ఎస్‌పి ఫక్కీరప్ప పరిశీలించారు. పరీక్ష కేంద్రాలు, స్ట్రాంగు రూముల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతపురం జెఎన్‌టియు పరీక్ష కేంద్రంలోని ఏర్పాట్లు పరిశీలించాక ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 22వ తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్షలు ఉంటాయన్నారు. అనంతపురం, గుత్తి కేంద్రాలుగా మొత్తం 47 ఎగ్జామ్ సెంటర్లు ఉన్నాయని తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన 24055 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. పరీక్షల సమయం కంటే గంట ముందు నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని చెప్పారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులూ వెంట తీసుకురాకూడదన్నారు. వాటిని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించమన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లతో పాటు గుర్తింపు కార్డు, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్నులు మాత్రమే తీసుకురావాలన్నారు. మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్, తదితర అక్రమాలకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామని తెలిపారు. పరీక్షా కేంద్రాల బయట ఎలాంటి అక్రమాలకు తావులేకుండా అనంతపురం, గుత్తి సెంటర్ల వద్ద డీఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో 10 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు పర్యవేక్షించనున్నాయని వెల్లడించారు. జిల్లా ఎస్పీతో పాటు అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, ఎ.హనుమంతు, డీఎస్పీలు ఎస్.మహబూబ్ బాషా, సి.ఎం.గంగయ్య, వన్‌టౌన్ సిఐ రవిశంకర్ రెడ్డి తదితరులు వెళ్లారు.

నేరాలు ఘోరాలు

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-పుట్లూరు

కోమటికుంట్ల గ్రామంలో పేకాట స్థావరాలపై ఎస్‌ఐ వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.26,700 స్వాధీనం చేసుకున్నారు.

ఎమ్మెల్యే పద్మావతి పుట్టినరోజు వేడుకలు

శింగనమల : ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పుట్టినరోజు వేడుకలను సింగిల్ విండో అధ్యక్షుడు బొమ్మన శ్రీరామ్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. వైసిపి మండల కన్వీనర్ పట్నం నగేష్, సీఈవో సూర్యనారాయణరెడ్డి, రామాంజనేయులు, మల్లికార్జునరెడ్డి, నాగవర్ధన్‌రెడ్డి, ఢిల్లీ శ్రీనివాస్ యాదవ్, చెవిరెడ్డి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి జన్మదిన వేడుకలను స్థానిక సొసైటీ కార్యాలయం ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. ఆర్డీటీ బదిరుల పాఠశాల విద్యార్థులకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. ఎంపీపీ సునీత, జడ్పిటిసి భాస్కర్, సర్పంచి పార్వతి, చికెన్ నారాయణస్వామి, పూల నారాయణస్వామి, ముత్యాల శీన, మానేరు కొండమ్మ పాల్గొన్నారు.

రాయలసీమ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతపురం కలెక్టరేట్ : రాయలసీమ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు నూతన కమిటీ వారు రాయలసీమ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్‌కె.కృపదాసు తెలిపారు. బుధవారం హౌసింగ్ బోర్డులోని చర్చిలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాయలసీమ పాస్టర్స్ ఫెలోషిప్‌లో ప్రభుత్వం ద్వారా రిజిస్టర్డ్ చేయబడిందన్నారు. పాస్టర్స్ సభ్యత్వం చేసుకోవాలని, చేరేవారికీ ఫెలోషిప్‌లో వున్న విజన్ సర్వీస్ వర్తిస్తాయని తెలిపారు ఆర్‌పిఎఫ్ అధ్యక్షులుగా మోసెస్, ఉపాధ్యక్షులుగా వి.సుదర్శన్, కార్యదర్శి సిహెచ్.దాస్, జాయింట్ సెక్రటరీ గంగాధర్, కోశాధికారి బి.లక్ష్మీనారాయణ, ఇసి సభ్యులు అంథోని, మాణిక్య రాజులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన టిడిపి రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ స్వామిదాసు మాట్లాడుతూ రాయలసీమ పాస్టర్స్ ఫెలోషిప్‌కు టిడిపి ఎల్లప్పుడు సహాయం చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం

గుత్తి : వాహన చోదకులు రహదారి నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం అవుతాయని గుంతకల్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజబాబు సూచించారు. బుధవారం ఏపీఎస్‌ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో రోడ్డు భద్రత వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఆటో డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంవిఐ రాజబాబు మాట్లాడుతూ డ్రైవర్లు వారి కుటుంబ సభ్యులు, అలాగే ప్రయాణికుల కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని డ్రైవింగ్ చేయాలన్నారు. ప్రతి డ్రైవరూ తప్పనిసరిగా రోడ్డు నిబంధనలను పాటించాలని సూచించారు.

రాయదుర్గం : రోడ్లపై ప్రయాణించేటప్పుడు వాహన చోదకులు, ప్రజలు భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వక్తలు పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలను బుధవారం నుండి వారం రోజులపాటు నిర్వహిస్తున్నట్లు రవాణా శాఖ మోటారు వాహనాల తనిఖీ అధికారి విశ్వనాథరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక డ్వామా హాలులో రవాణా శాఖ ఏర్పాటు చేసిన సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే, విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎపిఐఐసి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అనంతపురం జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రవాణా శాఖ విడుదల చేసిన కరపత్రాలను వారు విడుదల చేశారు. పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామ్మోహన్‌రెడ్డి, పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

23న ఉచిత మెగా వైద్యశిబిరం

ఉరవకొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన చేపట్టిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున కోరారు. బుధవారం వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ కార్డియాలజీ, ఆర్థో, జనరల్ మెడిసిన్ తో పాటు స్త్రీ సంబంధిత వ్యాధులకు సంబంధిత డాక్టర్లు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉరవకొండ చుట్టుపక్కల గ్రామాల వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జెఎన్‌టియు విసి రంగజనార్ధనకు అభినందనలు

అనంతపురం : అనంతపురం జేఎన్టీయూ ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఆచార్య రంగజనార్ధనకు వర్శిటీ డైరెక్టర్లు, బోధన, బోధనేతర, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. రంగజనార్ధన ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాలు అయిన సందర్భంగా రెక్టార్ ఆచార్య విజయకుమార్, రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్, యూనివర్సిటీ డైరెక్టర్లు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఓఎస్డీ ఆచార్య దేవన్న, ప్రిన్సిపల్ ఆచార్య పి.సుజాత, యూనివర్సిటీ డైరెక్టర్లు ఆచార్య కేశవరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, సుమలత, అరుణక్రాంతి, కిరణ్మయి, స్కిల్ డెవలప్ మెంట్ కోఆర్డినేటర్ మమత, విభాగ అధిపతులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మతల్లి ఊరు దేవర

'తోపుదుర్తి' విందుకు భారీగా జన సందోహం



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు

తోపుదుర్తి గ్రామంలో పెద్దమ్మ తల్లి ఊరుదేవర బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన భారీ విందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, అనధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. వేలాది మంది తరలి రావడంతో తోపుదుర్తి గ్రామం జనసంద్రమైంది. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తోపుదుర్తి ఆత్మరామిరెడ్డి, తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వచ్చిన ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించారు. వేల సంఖ్యలో కార్లు, జీపులు, బైకులు వచ్చినా ఎక్కడికక్కడే పార్కింగ్ చేసేలా ఏర్పాట్లు చేశారు. మంత్రి ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, శంకరనారాయణ, శ్రీధర్ రెడ్డి, సిద్ధారెడ్డి, పెద్దారెడ్డి, గుంతకల్ వెంకటరామిరెడ్డి, మడకశిర తిప్పేస్వామి, ఎమ్మెల్సీలు ఇక్బాల్, శివరామిరెడ్డి, ఎస్పీ పక్కీరప్ప, వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్‌పి చైర్మన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, ఆహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని సజ్జలదిన్నె పంచాయతీలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా భవనాలను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయాల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. ప్రతి సచివాలయంలో 12 మంది సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేశారన్నారు. గత ప్రభుత్వం హయాంలో ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూ ఇబ్బందులు పెట్టారన్నారు. ఇప్పుడు అలాంటి సమస్యలేదన్నారు. అనంతరం గ్రామంలోని మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా ఇంటి పట్టాలను గ్రామ సర్పంచి నీరజతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగభూషణం, ఎంపీడీవో రంగారావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేమన జయంత్యుత్సవ సభను జయప్రదం చేయండి

అనంతపురం : తెలుగు భాషకు, సాహిత్యానికి వెలుగునిచ్చిన ప్రజాకవి వేమన జయంతి సభను ఈనెల 19వ తేదీ ఉదయం 9–30 గంటలకు ఎస్ఎస్‌బిఎన్ కాలేజి క్యాంపస్‌లోని వేమన ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని, సభను జయప్రదం చేయాలని ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి, కార్యదర్శి డా.అప్పిరెడ్డి హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. వేమన ఫౌండేషన్ అనంతపురము కేంద్రంగా సంవత్సరకాలంగా వేమన సాహిత్యం, భావజాల విస్తరణకు కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా వేమన జయంతి సభను నిర్వహిస్తున్నామని చెప్పారు. సాహిత్యాభిమానులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ ధ్యేయం

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి



బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలోని సామాన్య, బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి పేర్కొన్నారు. బుధవారం విడపనకల్లు మండల పరిధిలోని గడేకల్ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, సర్పంచి సుశీల ఉమాశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విశ్వ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా వారు పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే సిఎం జగన్ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఒక్క గడేకల్ గ్రామంలో 2019 నుంచి 2022 వరకు దాదాపు రూ.20 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. గ్రామీణ ప్రాంతాలే దేశానికి పట్టుకొమ్మలని భావించిన ముఖ్యమంత్రి ఆ దిశగా విద్య, వైద్యం, కరెంటు, రోడ్లు లాంటి మౌలిక వసతులను కల్పిస్తూ అభివృద్ధికి బాటలు వేస్తున్నారని పేర్కొన్నారు. సంక్షేమం అభివద్ధి రెండు కల్లుగా భావించి అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా ముఖ్యమంత్రి కషి చేస్తుంటే చూసి ఓర్వలేని ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుతో పాటు ఎల్లో మీడియా కుట్రలు, కుతంత్రాలతో రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నించడం సిగ్గుచేటు అన్నారు. ఎంతమంది ఏకమైనా 2024 సార్వత్రిక ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలలో విజయకేతనం ఎగిరేసి మరోసారి జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకునే విధంగా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు కరణం భీమ్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, తహశీల్దార్ బ్రహ్మయ్య, మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి, ఎంఎల్ఒ కుళ్లాయిస్వామి, సహాయ గణాంక అధికారి పర్వతప్ప, ఎంపీటీసీ ఓబులేసు, నాయకులు సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవలందించడమే లయన్స్ క్లబ్ ధ్యేయం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కణేకల్లు

నిరుపేదలకు సేవలందించడమే లయన్స్ క్లబ్ ధ్యేయమని అధ్యక్షులు వేలూరు మరియప్ప, కార్యదర్శి చాంద్, షేక్ హుస్సేన్, తిమ్మసముద్రం కేశవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక చిక్కనేశ్వర కళ్యాణ మండపంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా మహిళా కమిషన్ సభ్యురాలు రికోయ బేగం విచ్చేశారు. అనంతపురం సవేరా ఆసుపత్రికి చెందిన ఆర్థో, కార్డియాలజీ, గైనిక్ స్పెషలిస్టులు వివిధ జబ్బులతో బాధపడుతున్న దాదాపు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైన్స్‌క్లబ్ కమిటీ సభ్యులు రైస్‌మిల్ చంద్ర, ఆనంద్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

జొన్నలగడ్డ నిర్మలాదేవి దాతృత్వం

శింగనమల : పెద్దమట్లగొంది గ్రామానికి చెందిన లింగమయ్య, సరస్వతి రెండో కుమారుడు కార్తీక్ రెండు కిడ్నీలు ఫెయిల్ అయిన విషయం తెలుసుకున్న జొన్న గడ్డ నిర్మలాదేవి ఆ కుటుంబానికి ఆర్థిక సాయంతో పాటు మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్తీక్ తల్లిదండ్రులు కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కార్తీక్‌కు వివాహం అయింది. ప్రస్తుతం భార్య నాలుగు నెలల గర్భవతి. కార్తీక్‌కు రెండు కిడ్నీలూ ఫెయిల్ అయి మంచానికే పరిమితమయ్యాడు. ఆ కుటుంబం ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తోంది. విషయం తెలుసుకున్న జొన్నలగడ్డ నిర్మలాదేవి బుధవారం ఆ కుటుంబాన్ని పరామర్శించింది. కొంత నగదు, నిత్యావసర సరుకులు అందజేసింది. వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

నాగలింగస్వామిని దర్శించుకున్న బండారు శ్రావణిశ్రీ

పుట్లూరు : శింగనమల నియోజవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ జంగంరెడ్డిపేట గ్రామంలో వెలసిన శ్రీ నాగలింగేశ్వర స్వామి వారిని బుధవారం దర్శించుకున్నారు. అనంతరం మడుగుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు నాగేంద్ర నాయుడు ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కడవకల్లు గోవర్ధనరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిద్దాం



అనంతపురంలో రోగులకు పండ్లు అందజేస్తున్న టిడిపి మహిళా విభాగం సభ్యులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

త్రికరణ శుద్ధిగా మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారాకరామారావు ఆశయాలు కొనసాగిద్దామని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పిలుపునిచ్చారు. బుధవారం టిడిపి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్టీఆర్ గ్రహానికి నాయకులు పూల మాలలు వేసి నివాళు లు అర్పించారు. లలితకళా పరిషత్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. 200 మంది టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రక్తం దానం చేశారు. మహిళా విభాగం ఆధ్వర్యంలో సర్వజనాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ ఆధ్వర్యంలో సర్వజనాసుపత్రిలో రోగులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ సాకే గంపన్న, రాష్ట్ర కార్యదర్శులు ఆదినారాయణ, దేవర్ల మురళి, జిల్లా ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, కూచి హరి, నారాయణస్వామి యాదవ్, సమన్వయ కర్త శివబాల, సిమెంట్ పోలన్న, మాజీ కార్పొరేటర్లు సరళ, షరీనా, నగర అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి స్వప్న, అధికార ప్రతినిధి సంఘ తేజస్వీణీ, గాండ్ల విశాలాక్షి, గుర్రం నాగభూషణ, శిల్ప, హసీన, మనేమ్మ, వసుంధర, క్రిష్ణవేణి, మహేశ్వరి, కంటాదేవి, గౌసియా, చల్లా పద్మావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : రాష్ట్రం బాగుండాలన్నా, పేదలకు న్యాయం లభించాలన్నా, శాంతిభద్రతలు పరిరక్షింపబడాలన్నా రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు తిరిగి సిఎం కావాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా రాయదుర్గం పట్టణంలోని బళ్ళారి రోడ్డులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఆయనను స్మరించుకుంటూ ఆయన ఏర్పాటు చేసిన పార్టీ పునాదులను బలోపేతం చేయడానికి ప్రతి నాయకుడు, కార్యకర్తా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షులు పూల నాగరాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మండల కన్వీనర్ హనుమంతు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, మైనారిటీ విభాగం నాయకులు మహబూబ్ బాషా, వాణిజ్య విభాగం నాయకులు వెంకటేశులు, పార్టీ నాయకులు సంపత్ కుమారి, ప్రవీణ్, సురేంద్ర, తిప్పేస్వామి, శంకర్, లోకేష్, తిప్పయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

నార్పల : టిడిపి నాయకులు ఆకుల ఆంజనేయులు, ఆకుల విజయకుమార్ (బాబు) ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు సూర్యప్రకాష్, మాజీ వైస్ ఎంపీపీ తిప్పన్న, మదమంచి ప్రతాప్ చౌదరి, రాధాకృష్ణ, ఆకుల కిషోర్, సాలెహ్, గుమ్మడం రాధాకృష్ణ, రంగాపురం సర్పంచి నల్లపాటి కుల్లాయప్ప, గూగూడు నరసింహుడు, రాయవరం శ్రీరాములు, గడ్డం నాగేపల్లి బాలయ్య, ఉపసర్పంచి హుస్సేన్ పీరా, మాజీ ఎంపీటీసీ వేణుగోపాల్, కేసేపల్లి లక్ష్మీనారాయణ, టిఎన్ఎస్ఎఫ్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఆలం వెంకట నరసానాయుడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు పాల్గొన్నారు.

శింగనమల : తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక శ్రీరామస్వామిదేవాలయం వద్ద ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అన్నదానం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మారుతీ నాయుడు, మాజీ ఎంపీటీసీ కూళ్లాయప్ప, కోశాధికారి శ్రీనివాసులు గౌడ్, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, తెలుగు యువత అధికార ప్రతినిధి బ్యాళ్ళ సుదర్శన్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో టిడిపి నాయకులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు, హిందూపురం పార్లమెంటరీ అధికార ప్రతినిధి శశాంక్ చౌదరి, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘం అధికార ప్రతినిధి మంగలి ఆనంద్, రైతు విభాగం జిల్లా కార్యదర్శి రవీంద్రారెడ్డి, గూలి కొండారెడ్డి, మాజీ హైస్కూల్ కమిటీ ఛైర్మన్ కందుల ఓబుళపతి, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్ నాయుడు ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు విజయ్‌కుమార్ నాయుడు, రవిచంద్ర నాయుడు, శివశంకర్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, ఓబులనాయుడు, గోపాల్ రెడ్డి, రామచంద్రారెడ్డి, రవికుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, భాస్కర్ నాయుడు, మల్లేపల్లి చంద్ర, నాగేశ్వరరెడ్డి, పెద్దయ్య, కుల్లాయప్ప, తీర్థమయ్య, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండల కేంద్రంలోని ఎల్బీనగర్ నందు టిడిపి ఇన్‌ఛార్జి ధనుంజయ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ కన్వీనర్ బలరాం రెడ్డి, నవీన్‌కుమార్, సైకిల్ షాప్ హనుమంతు, సంగప్ప, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : స్థానిక టిడిపి నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మండల టిడిపి నాయకులు మల్లికార్జున, జీడిపల్లి వెంకట నాయుడు, ఆవులెన్న సర్పంచి రామ్మోహన్, మాజీ ఎంపీటీసీ కంచి రాముడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరవకొండ : టిడిపి విడపనకల్లు మండల కన్వీనర్ గిడ్డ ప్యారయ్య ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళు లర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. జిల్లా పార్లమెంటరీ ఉపాధ్యక్షులు హనుమంతు సర్పంచులు చంద్రశేఖర్, రాజస్వామి, తిప్పారెడ్డి, తిమ్మరాజు, జనార్దన్ నాయుడు, అశోక్, సినిమా రామాంజనేయులు, భీమలింగ, మాజీ ఎంపీపీ సోమశేఖర్ నాయుడు, ఉండబండ వన్నూరు స్వామి తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : టిడిపి మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అవులాంపల్లి కేశవరెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నారయణస్వామి, వెంకట్రాంరెడ్డి, చిరంజీవి, ప్రసాద్ యాదవ్, నాగేశ్వరరెడ్డి, బాషా, దస్తగిరి, నాగన్న, రంగప్ప, నాగరాజు, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



నార్పలలో నివాళి అర్పిస్తున్న టిడిపి నాయకులు



రాయదుర్గంలో టిడిపి నాయకుల నివాళి